

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

05 జులై 2025 పేజీలు : 08

శనివారం


## మన్యం వీరుడికి నివాళులు



**నెల్లూరు అర్బన్/క్రైమ్ మేజర్‌న్యూస్ :**

భారతదేశ స్వతంత్రం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గిపిడుగు మన అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు శుక్రవారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ అల్లూరి సీతారామరాజు 1897 జూలై 4న విశాఖపట్నం జిల్లా పాండ్రంగిలో వెంకటరామరాజు, సూర్యనారాయణమ్మ దంపతులకు జన్మించారు. అల్లూరి సీతారామరాజు సంస్కృతం, జ్యోతిష్య శాస్త్రం, విలు విద్య, గుర్రపు స్వారీలో అధిక ప్రావీణ్యం సాధించి, మన్యం ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి, బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి స్వాతంత్రం కోసం పోరాటానికి సిద్ధపరిచారు, మన్యం ప్రజల హక్కుల కోసం పోరాడి 27 ఏళ్ళ చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన ధీరుడు.. చైతన్య జ్యోతి అల్లూరి అని కొనియాడారు. అల్లూరి జయంతి సందర్భంగా ఆ మహావీరుడికి ఎస్పీ నమసుమాంజులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చెత్త నుండి సంపద తయారీ కేంద్రమా ?

### చెత్తను తగలబెట్టే కేంద్రమా ?

7లో

## ఏడాది సంబరాలు నాలుగేళ్లలో లక్ష్యాలు



- 49వ డివిజన్లో అడుగడుగునా మంత్రికి ఘన స్వాగతం
- ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేత
- సమస్యలకు సత్వరమే పరిష్కారం మార్గం చూపిన మంత్రి
- మరోసారి వైసీపీపై తీవ్రస్థాయిలో మండిపాటు
- మ్యానిఫెస్టో హామీలు తూచ తప్పకుండా అమలు చేస్తామన్న మంత్రి నారాయణ
- పేదల అభివృద్ధి కోసమే పీ4 కార్యక్రమం సీఎం చేపట్టారని మంత్రి వెల్లడి






### 'టీడీపీ సుపరిపాలన-తొలి అడుగు'లో మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు సంతపేట తూకుమానుమిట్టలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో శుక్రవారం రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు. డివిజన్‌కి విచ్చేసిన మంత్రికి స్థానిక టీడీపీ నేతలు, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ క్రమంలో ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో చేసిన అభివృద్ధిని మంత్రి వివరించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలు మంత్రి అందజేశారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. సత్వరమే పరిష్కరించదగ్గ సమస్యలపై స్పాట్‌లోనే నిర్ణయం తీసుకొని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి నారాయణ కోరారు. డివిజన్‌కు విచ్చేసిన మంత్రి నారాయణకు అభివృద్ధి ప్రదాతకు అడుగడుగు నీరాజనాలతో మహిళలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. 30 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా సుపరిపాలన పండగ నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటికి వెళ్లి చేసిన అభివృద్ధిని, ఇచ్చిన

-మిగతా 2లో

## దాతృత్వం చాటుకున్న ఎంపీ వేమిరెడ్డి



> 10వ రెవెన్యూ క్రీడా సాంస్కృతిక మహోత్సవాల నిర్వహణకు రూ.11 లక్షలు అందజేత
>
> కృతజ్ఞతలు తెలిపిన జిల్లా రెవెన్యూ ఉద్యోగులు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. నెల్లూరు జిల్లాలో 10వ రెవెన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ కోసం రూ.11 లక్షల ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు శుక్రవారం నెల్లూరులోని తన నివాసంలో అసోసియేషన్ సభ్యులకు చెక్కును అందించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ ఈనెల 11, 12, 13 తేదీల్లో నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 10వ జిల్లా రెవెన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించుటకు అనుమతిచ్చారు. జిల్లా రెవిన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలలో పాల్గొనే జిల్లాలోని రెవెన్యూ క్రీడాకారులకు కొన్ని సంవత్సరాలుగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. వీపీఆర్ ఫౌండేషన్ తరపున క్రీడా దుస్తులను అందజేస్తున్నారు. గతంలో 2018లో జరిగిన జిల్లా రెవెన్యూ క్రీడాల్లోనూ, 2022లో జరిగిన జిల్లా రెవెన్యూ క్రీడల్లోనూ వీపీఆర్ ట్రస్ట్ తరపునే దుస్తులను అందించి రెవెన్యూ ఉద్యోగుల క్రీడలకు ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహించారు. ప్రస్తుతం కూడా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని రెవెన్యూ శాఖ తరపున కలవగా.. వారు సానుకూలంగా స్పందించి జిల్లాలోని రెవెన్యూ క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేయుటకు అంగీకరించి, జిల్లా రెవెన్యూ క్రీడల నిర్వహణకు రూ.11 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా రెవెన్యూ క్రీడా నిర్వహణకు ఆర్థిక సహాయం చేసిన

-మిగతా 2లో

## బాధితులకు సెల్‌ఫోన్లు అందించిన ఎస్పీ



07 పేజీలో

## సమన్వయంతో పని చేయండి



వివరాలు 2లో

# సమన్వయంతో పని చేయండి

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు - ఇన్‌ఛార్జ్ కలెక్టర్ కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రొట్టెల పండుగ సంబంధించి విధులు కేటాయించిన శాఖలు సమన్వయంతో పని చేసి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పటిష్టంగా నిర్వహించాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ కే.కార్తిక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక బారాషాహీద్ దర్గా వద్ద సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధులు కేటాయించిన అధికారులు విధిగా 24/7 విధులు నిర్వహించేలా సిబ్బందిని నియమించా లని, సదరు వివరాలను అందరూ జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. మౌలిక వసతుల కల్పన విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఘాట్‌ల నిర్వహణలో అలసత్వం వహించారాదన్నారు. సిసి టివిలు అవసరమైనన్ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు. పబ్లిక్ అనౌన్స్ సిస్టం ఏర్పాటు చేయాలని, పార్కింగ్ ప్రదేశాలలో కూడా త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. మగ, ఆడవారికి విడి విడిగా మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్యం పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, పారిశుధ్య పనికి ఎంత మంది సిబ్బందిని నియమించారని వివరాలు సేకరించారు. ఏదైనా పనులు నిమిత్తం వచ్చే వాహనాలను అనుమతించి, పని అయిపోయిన వెంటనే బయటికి పంపాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కలగకుండా అవసరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రధమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సదరు కేంద్రాలను వచ్చే భక్తులకు అందుబాటులో, బాగా కనపడేలా ఉండలాన్నారు. మంచినీరు అందుబా టులో ఉంచాలన్నారు. పడిన చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చూడాలన్నారు. అగ్నిమాపక శాఖకు అవసరమైన ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. స్టాల్స్ ఏర్పాటులో క్రమ పద్దతి పాటించాలని, ప్రణాళికా ప్రకారం ఉండాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గజ ఈతగాళ్ళను ఘాట్‌ల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు జాగ్రత్తగా విధులు నిర్వహించి రొట్టెల పండుగను విజయ వంతం చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, మునిపల్ కార్పొరేషన్ కమీషనర్ నందన్‌లతో కలసి దర్గా, స్వర్ణాల చెరువు వద్ద ఘాట్‌లను, బ్యారికేడ్‌ల ఏర్పాట్లను సునిశితంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందజేశారు.

# ఎంపీ వేమిరెడ్డి సహకారంతో విద్యుత్ సమస్య పరిష్కారం

- 7 లక్షల ఎంపీ నిధులు కేటాయింపు
- 4 వారాల్లో పరిష్కరించాలని అధికారులకు ఆదేశం
- ఉదయగిరిలో ప్రచారం సందర్భంగా సమస్యను ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తెచ్చిన స్థానికులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరిలో స్థానికులు ప్రస్తావించిన విద్యుత్ సమస్యలపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సత్వరమే స్పందించారు. విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు ఎంపీ నిధుల నుంచి 7 లక్షల మంజూరు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. గురువారం ఉదయగిరి పట్టణంలోని దిలావర్ భాయ్ వీధిలో షబ్బీర్ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికి టీడీపీ కార్యక్రమం కింద ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ నేపథ్యంలో స్థానికులు తాము ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఉదయగిరి పట్టణంలోని షబ్బీర్ కాలనీలో నివాస గృహాలపై నుంచి ప్రస్తుతం వెళుతున్న 11 కేవీ/ఎన్‌టీ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లను స్థల మార్పిడి చేయాలని కోరారు. వైర్లు ఇంటి మీదుగా వెళ్లడం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, కరెంట్ షాకులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నివాసితులు చెప్పారు. దాంతో స్పందించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అక్కడి నుంచే విద్యుత్ శాఖ ఎస్‌ఈ, డీఈలతో మాట్లాడారు. శుక్రవారం అధికారులతో మరోమారు మాట్లాడిన ఎంపీ వేమిరెడ్డి.. సమస్య గురించి మరిన్ని వివరాలు ఆరా తీశారు. విద్యుత్ వైర్ల సమస్యతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను దృష్టికి తెచ్చి వెంటనే విద్యుత్ లైన్ల మార్పిడికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు అవసరమైన నిధులను ఎంపీ ల్యాడ్స్ నుంచి 7 లక్షలు మంజూరు చేశారు. దాంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా తాము పడుతున్న ఇబ్బందుల నుంచి ఉపశమనం లభించిందని చెబుతున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ఏడాది సంబరాలు.. నాలుగేళ్లలో లక్ష్యాలు..

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమాన్ని వివరిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి విశేషమైన స్పందన, ఆదరణ వస్తోందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వెళ్ళిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్తవ్యస్తంగా పరిపాలన సాగించిందన్నారు. ఆర్ధిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట మీద సీఎం చంద్రబాబు నాయుడు నిలబడ్డారన్నారు. మేనిఫెస్టో హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తున్నారని భరోసా ఇచ్చారు. ఇప్పుడిప్పుడే అప్పుల ఊబి నుంచి రాష్ట్రం బయటపడుతోందన్నారు. ఆర్ధిక పరిస్థితిని చక్కబెడుతూ పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని తెలిపారు. తల్లికి వందనం నిధులు అకౌంట్‌లలో పడ్డాయన్నారు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ హామీ నెరవేర్చారని హర్షం వ్యక్తం చేశారు. అన్నా క్యాంటీన్లు పునరుద్ధరించారన్నారు. మాట ప్రకారం పెన్షన్ 4 వేలకు పెంచారని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ఆగస్ట్ నుంచి అమలు చేయబోతున్నారని తెలియజేశారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు మూడు విడతల్లో 20 వేలు ఇవ్వబోతున్నారన్నారు. పేదల అభ్యున్నతి కోసం పీ4 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపట్టారని తెలిపారు. సీఎం పిలుపుతో మార్గదర్శకులు ముందుకొస్తున్నారన్నారు. నెల్లూరు సిటీలో తాగునీటి సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతీ ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేస్తానని భరోసా ఇచ్చారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేసి నెల్లూరును దోమలరహిత నగరంగా తీర్చిదిద్దుతానన్నారు. పార్కులను అన్నిహంగులతో సిద్ధం చేసి ప్రజలకు అంకితం చేశానని తెలియజేశారు. పేద పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో వీఆర్ హైస్కూల్‌ని సిద్ధం చేశామని తెలిపారు. అదే తరహాలో ఏడాదిలోపు మరో పద్నాలుగు పాఠశాలల రూపురేఖలు మారుస్తానన్నారు. ప్రజలు ఓపిక పడితే మానిఫెస్టో హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్లపాక అనూరాధ, డివిజన్ నాయకులు ఖాదర్ బాషా, వందవాసి రంగా, బండి ప్రసాద్, ఖాదర్ బాషా, పెంచలయ్య, కపిర రేవతి తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న ఎంపీ వేమిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి జిల్లాలోని అందరు రెవెన్యూ ఉద్యోగుల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్, తెలుగు గంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ హుస్సేన్ సాహెబ్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా రిటైర్డ్ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** 33/11కేవీ డైకస్ రోడ్డు సబ్ స్టేషన్ లోని 11 కేవీ రామయ్య బడి ఫీడర్ మరమ్మత్తుల కారణంగా అలంకార్ సెంటర్, రామయ్య బడి వీధి పరిసర ప్రాంతాలలో శనివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎమ్.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# మరో 14 హైస్కూల్స్ కార్పొరేట్ తరహాలో అభివృద్ధి : మంత్రి నారాయణ

- ప్రారంభోత్సవానికి తుదిమెరుగులు దిద్దుకొంటున్న వీఆర్సీ హైస్కూల్
- 7న ప్రారంభోత్సవం చేయనున్న విద్యాశాఖా మంత్రి నారా లోకేష్
- స్కూల్‌ని సందర్శించి ఏర్పాట్లపై పలు సూచనలిచ్చిన మంత్రి నారాయణ



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ ప్రమాణాలతో నెల్లూరులోని విఆర్ హైస్కూల్‌ని అభివృద్ధి చేశామని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఇదే తరహాలో నెల్లూరు సిటీలో ఉన్న మరో 14 హైస్కూల్స్‌ని దాతల సహకారంతో అభివృద్ధి చేయబోతున్నామని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు మంత్రి లోకేష్ శ్రీకారం చుట్టారని.. అందులో భాగంగానే హైస్కూల్స్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రారంభోత్సవానికి తుది మెరుగులు దిద్దుకుంటున్న వీఆర్ హైస్కూల్ను ఆయన పరిశీలించారు. ఏడో తేదీన మంత్రి లోకేష్ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు ఇచ్చిన మంత్రి, యూనిఫామ్ పాఠ్యపుస్తకాల పంపిణీపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.. పిల్లలకు చదువు మించిన ఆస్తి లేదని, చదువుకున్నాను కాబట్టే తాను ఈ స్థాయికి రాగలిగానని స్పష్టం చేశారు. సిటీలో 6 వేల మంది పైచిలుకు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని వారందరికీ మెరుగైన విద్యను అందించడమే నా సంకల్పం అన్నారు. వీఆర్ హైస్కూల్‌తోపాటు సంతపేటలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలను సందర్శించి ఇండోర్ గేమ్స్ నిర్వహించే మైదానాన్ని పరిశీలించారు. వీఆర్ హైస్కూల్ క్రీడా మైదానంపై ప్రత్యేక దృష్టి పెట్టిన దొడ్డపనేని పృథ్వి దంపతులను ఆయన అభినందించారు. వీఆర్‌సికి 45 మంది ఉపాధ్యాలను మంత్రి లోకేష్ కేటాయించారని, ఒకే రోజు 1050 సీట్లు భర్తీ అయ్యాయన్నారు.. ఆరో తేదీ సాయంత్రం విద్యాశాఖ మంత్రి నెల్లూరుకు వచ్చి 7న ఉదయం 9 గంటలకు విఆర్ హైస్కూల్ను ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. అనంతరం అనిల్ గార్డెన్లో సిటీ టిడిపి కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని, సాయంత్రం బారా షహీద్ దర్గాను సందర్శించి అక్కడి నుంచి తిరుపతి వెళ్తారని మీడియాకు వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకట్రావు పాల్గొన్నారు.

# 20 ద్విచక్ర వాహనాలను ప్రారంభించిన ఎస్పీ

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వాహనాలలో డీజీపీ కార్యాలయం నుండి నెల్లూరు జిల్లాకి 20 అపాచీ ఆర్టీఆర్ ద్విచక్ర వాహనాలు కేటాయించబడ్డాయి. వాటిని జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. వీటిని నెల్లూరు ట్రాఫిక్, నెల్లూరు రూరల్, ఆత్మకూరు, కావలి, కందుకూరు సబ్ డివిజన్లకు కేటాయించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు ఈ వాహనాలు ఎంతగానో తోడ్పాటు అందిస్తాయని, పగలు, రాత్రి గస్తీ తిరిగేందుకు, అవసరమైన సమయాలలో సంఘటనాస్థలాలకు త్వరగా చేరేందుకు ఎంతగానో ఉపయోగకరంగా ఈ వాహనాలు ఉంటాయని ఆయన తెలియజేశారు. జిల్లాలో సురక్షిత మరియు ప్రమాద రహిత ప్రయాణం, నగరంలో ట్రాఫిక్ సవాళ్లను అధిగమించేందుకు పరిస్థితులు పూర్తిగా అధ్యయనం చేసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నియంత్రణకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు నగర జనాభా పెరుగుదల, వివిధ ప్రాంతాల నుండి ప్రజలు వలసలు, వాణిజ్య ప్రాంతం కావడం వలన నిత్యం వివిధ ప్రాంతాల నుండి ప్రజలు రాకపోకలు, విద్యాసంస్థల కేంద్రంగా ఉండటం తదితర కారణాలవల్ల ట్రాఫిక్ నిర్వహణ అంశం ఒక సవాలుగా మారిందని, అయినా కూడా అన్ని విభాగాలు సమన్వయంతో ప్రయత్నిస్తున్నారని అన్నారు. అదేవిధంగా అవగాహన లోపం, అతివేగం, వ్యతిరేక దిశలో



ప్రయాణం, లైసెన్స్ లేకుండా వాహనం నడపటం, నిర్లక్ష్యంగా, మద్యం సేవించి వాహనాలు నడపటం, సెల్ఫోన్ డ్రైవింగ్, ఓవర్ టేకింగ్ వలనే రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు రోడ్లపై ప్రయాణం చేసే సమయంలో ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని ఆయన కోరారు. ముఖ్యంగా ఆటోలలో ప్రయాణించే ప్రయాణికులను, స్కూల్ పిల్లలను పరిమితికి మించరాదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, టౌన్ డీఎస్పీ సింధు ప్రియా, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, ఏఆర్‌డిఎస్‌పి చంద్రమోహన్, టౌన్ సీఐలు, ఆర్ఐలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గాంధీ ఆశ్రమంలో అల్లూరి సీతారామరాజు జయంతి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పల్లిపాడు గ్రామంలో ఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా ఇందుకూరుపేట బీజేపీ మండలాధ్యక్షులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, బిజెపి మండల ఉపాధ్యక్షుడు దువ్వూరు రామ్మోహన్‌రెడ్డి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి మాలవేసి నివాళులర్పించారు. అనంతరం కో కన్వీనర్ నెల్లూరు రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు రెండేళ్ల పాటు బ్రిటీషర్లకు కంటిమీద కునుకులేకుండా చేసిన సీతారామరాజు. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశారు. ఆశ్రమ కమిటీ సభ్యులు కందికట్ల రాజేశ్వరి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో తెల్ల దొరలకు సింహస్వప్నంగా నిలిచిన పోరాట యోధుల్లో అల్లూరి సీతారామరాజు ఒకరు. అల్లూరి జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్యోద్యమంలో ఓ అధ్యాయం. స్వాతంత్ర్యం పొందటానికి సాయుధ పోరాటం ఒక్కటే అని నమ్మిన అల్లూరి సీతారామరాజు తన పోరాట పటిమతో బ్రిటీష్ సైన్యాన్ని వణికించారు. ఇలాంటి మహోన్నత వ్యక్తుల జయంతి కార్యక్రమాన్ని స్వతంత్ర పోరాట కేంద్రమైన మన గాంధీ ఆశ్రమంలో జరుపుకోవడం ఆనందదాయకమైన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వీఎస్‌యూ ఏపీఎస్ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** కాకటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి రవాణా సౌకర్యాన్ని అందించేందుకు ఏపీఎస్ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ ఎస్.సురేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం ప్రారంభం నుండి విద్యార్థులు, సిబ్బంది సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆ అవసరాన్ని గుర్తించి ఏపీఎస్ఆర్టీసీ ద్వారా బస్సు సౌకర్యాన్ని కల్పించడానికి చేసిన ప్రయత్నం ఇప్పటికీ సఫలమైందని అన్నారు. కలెక్టర్ ఓ. ఆనంద్ సూచనల మేరకు, చైర్మన్ సురేష్ రెడ్డి, నెల్లూరు డిపో-1 మేనేజర్ కె.వి. మురళీకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ ఎం. సునీత లు అందించిన సహకారాన్ని ఆయన ప్రత్యేకంగా గుర్తు చేశారు. ఈ బస్సు సౌకర్యం వలన విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు, సిబ్బందికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. దీనికి సమన్వయం చేసిన వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా



అభినందించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ ఎస్.సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యాసంస్థలకు రవాణా సౌకర్యం కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ఎటువంటి సహాయం అవసరమైన ముందుండి చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




అఫిలియేషన్ రెన్యువల్‌కు

# నోటిఫికేషన్ విడుదల

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల అఫిలియేషన్ పునరుద్ధరణ కోసం నోటిఫికేషన్ విడుదలైంది. జూలై 4 నుంచి 11లోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. అవసరమైన పత్రాలను జూలై 12న సీడీసీ కార్యాలయానికి సమర్పించాలి. ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అఫిలియేషన్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** సమాజంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మన ఫౌండేషన్ అధినేత మన్నటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని వెంకట్రావుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల హెచ్ఎం చల్ల వెంకటేశ్వర్లు, పిఎంసి చైర్మన్ షేక్ రసూల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమాన్ని అలవాటు చేసుకుని వాటిని సంరక్షించుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులు కూడా ఇండ్ల వద్ద, పొలం గట్ల పైన మొక్కలు నాటే అలవాటును పెంచుకోవాలన్నారు. అటువంటి విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్ట్ అవార్డు అందిస్తామన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు బలరామయ్య మాట్లాడుతూ.. పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారని, నాణ్యమైన విద్యను అందించి పాఠశాల అభివృద్ధికి తోడ్పడతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్థానికులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వాటర్ బాటిళ్లు బహూకరణ



**బోగోలు, మేజర్‌న్యూస్ :** మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు కొత్తూరు గ్రామ నివాసి పసుపులేటి సాయి దంపతులు పాఠశాల విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్‌లను శుక్రవారం అందజేశారు. విద్యార్థులు కొందరు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను ఉపయోగిస్తున్నారని ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని అన్నారు. పసుపులేటి సాయి దంపతులు పాఠశాల అభివృద్ధికి అన్ని విధాల సహాయ సకారాలు అందిచారని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పాఠశాల భవనానికి ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారని స్కూల్ అధ్యాపకురాలు శారద తెలిపారు. ఈ సందర్భంగా సాయి దంపతులకు పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు పసుపులేటి నారాయణ, పసుపులేటి సాయి, పసుపులేటి లక్ష్మి, మున్ని, ప్రవంతి విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సైదాపురంలో మైనింగ్ కూలీల ఆటో మళ్ళీ బోల్తా



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం తహశీల్దార్ కార్యాలయం సమీపంలో కూలీలతో వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయ పడగా పలువురికి గాయాలయ్యాయి. సైదాపురం నుండి జోగిపల్లికి మైనింగ్‌లో పనిచేసేందుకు కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా పడడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను 108లో గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతనెల 26వ తేదీన సైదాపురం మండలంలోనే మైనింగ్‌లో పనిచేసేందుకు కూలీలతో వెళుతున్న ఆటో కలిచేడు వద్ద బోల్తా పడడంతో 10 మందికి పైగా గాయాల పాలయ్యారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎంతో మంది కూలీలు ప్రాణాలు పోవడం, క్షతగాత్రులుగా మారడం, కొందరు కాళ్ళు చేతులు పోగొట్టుకుని దీర్ఘ కాలికంగా మంచంకే పరిమితం అయిపోతున్నారు. కుటుంబ పోషకులుగా ఇంటి పెద్దగా ఉన్నవారు ఇలా నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడిపోతున్నాయి, ఫిట్ నెస్ లేని ఆటోలు, నిబంధనలు పాటించని ఆటోలు, అనుభవం లేని ఆటో డ్రైవర్లు, పట్టించుకోని ప్రభుత్వ అధికారులు, ఆదుకొని మైన్ యజమానులు, ప్రమాదాలు జరిగినప్పుడు కూలీలు బతుకులు, వారిని నమ్ముకున్న కుటుంబ సభ్యుల జీవితాలు చీకటిలో మగ్గిపోతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజా మన్ననలు పొందాలని జిల్లా మలేరియా నియంత్రణాధికారిని ఇ.హుస్సేన్నమ్మ పేర్కొన్నారు. ఆమె శుక్రవారం కీటక జనిత వ్యాధుల నియంత్రణలో భాగంగా మండలంలోని గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వైద్యశాలలోని రికార్డులను, ల్యాబ్‌ను పరిశీలించిసిబ్బందికి సూచనలు సలహాలు అందించారు.సిబ్బంది ప్రభుత్వం వైద్యశాలను ప్రజలకు అందుబాటులో ఉండి అందించాలన్నారు. అనంతరం డెంగ్యూ మా సోత్సవాల లో భాగంగామండలంలోని వెంగళరావు నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలోవిద్యార్థులకు అవగాహన కార్యక్రమం కల్పించి ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే తప్పనిసరిగా పాటించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. రాత్రి వేళ నిదురించేటప్పుడు దోమతెరలు వాడాలన్నారు. వైద్య సిబ్బంది అందించే ఆరోగ్య సూత్రాలు పాటించడం ద్వారా మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, మెదడువాపు, పైలేరియా



వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిని వినీత, హెచ్‌ఎం హసీనా, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్ బాబు, సిహెచ్‌ఓ శివకుమారి, ఎంఎల్‌హెచ్‌పి మెర్సీ, ఆరోగ్య సహాయకులు ఎం.నారాయణ, జి.శ్రీనివాసులు, రబ్బాని, హసానయ్య, ఆరోగ్యకార్యకర్త విజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణపట్నం పోర్టు.. వరుస సరుకు రవాణా రికార్డులు




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అదానీ పోర్ట్స్ లిమిటెడ్ యొక్క అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ ఈ సంవత్సరం జూన్ నెలలో అత్యధికంగా 5.85 మిలియన్ మెట్రిక్ టన్నులు నెలవారీ కార్గో వాల్యూమ్‌ను నమోదు చేయడం ద్వారా కొత్త మైలురాయిని చేరుకుంది. ఇది గత నెలలో 5.74 మెట్రిక్ మిలియన్ టన్నుల రికార్డును అధిగమించింది. వరుసగా రెండవ నెలలో కూడా రికార్డును బద్దలుకొట్టింది. కృష్ణపట్నం పోర్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ ఈ విజయాన్ని సమష్టి కృషి, కార్యాచరణ నిబద్ధత వలన జరిగిందని శుక్రవారం తెలియజేశారు. ఈ మైలురాయి ప్రతి ఉద్యోగి యొక్క అవిశ్రాంత కృషి, సమన్వయంతోపాటు అచంచలమైన అంకిత భావానికి నిదర్శనంఅని ఆయన అన్నారు. దీన్ని సాధ్యం చేసినందుకు మా ఉద్యోగులు, వ్యాపార భాగస్వాములు, విలువైన కస్టమర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పోర్ట్ ప్రారంభం నుంచి ఇంత పెద్ద వాల్యూమ్‌ను సాధించడం ఇది రెండవసారి మాత్రమే. అని అదే విధంగా ఈ మైలురాయిన ఏకేపీఎల్ గ్రౌండ్ టీం యొక్కపనితీరు, నిబద్ధతచ జట్టు కృషి. పోర్ట్ యొక్క కార్యాచరణ సామర్థ్యం, వృద్ధి పథాన్ని సూచిస్తున్నాయన్నారు. ఈ పనితీరుతో అదానీ కృష్ణపట్నం పోర్ట్ భారతదేశ తూర్పు తీరంలో ప్రముఖ లాజిస్టిక్స్, కార్గో హబ్‌గా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుందని దేశం యొక్క పెరుగుతున్న సముద్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

# సముద్రతాబేళ్ల సంరక్షణ మనందరి భాద్యత

- సముద్ర తీర ఉపరితలాల్లో నిఘా ముమ్మరం చేయాలి
- సముద్రంలోకి మరపడవలను నిషేదించాలి
- జిల్లా అటవీ అధికారి కదిరి మహబూబ్ బాషా

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ఆరోగ్యకర సమాజాన్ని వెంటాడు తున్న కాలుష్యానికి కారణమవుతున్న క్రిమికీటకాలను హరింపజేయడం తోపాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్రపోషిస్తున్న సముద్ర తాబేలు జాతి సంరక్షణను ప్రతి ఒక్కరూ భాద్యతగా స్వీకరించాలని జిల్లా అటవీ అధికారి కదిరి మహబూబ్ బాషా పిలుపునిచ్చారు. సముద్ర తాబేళ్ల పరిరక్షణపై శుక్రవారం స్థానిక అటవీ టెరిటోరియల్ డివిజనల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా అటవీ అధికారి మహబూబాబాషా పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి దిశ, నిర్దే శాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఎడాది అక్టోబరు నెలలో సముద్రతీర ప్రాంతానికి 10 కిలోమీట్ల దూరంలో ఆడ, మగ తాబేళ్ళు సంయోగం (కలయిక) చెందుతాయని. ఈ క్రమంలోనే మగ తాబేలు సముద్రంలోకి వెళుతుందన్నారు. ఆడ తాబేలు మాత్రం ఇసుక మేట ల మధ్యన గూళ్ళను (నెట్స్) ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొని నవంబరు, డిసెంబరు, జనవరి మాసాల్లో గ్రుడ్లను పెడుతుందని, అందుకు ఏర్పాటు చేసుకునే 5 నుంచి 6 రకాల మదర్ బిట్స్‌ కేవలం 3 నుంచి 4లోపు గూళ్ళ లో మాత్రమే గుడ్లు పెడుతుందన్నారు. గూళ్ళలోని గ్రుడ్లను మరపడవలు, తీరప్రాంతాల్లో సంచరించే కుక్కలు, ఇతర జంతువుల నుంచి పొంచి ఉన్న ప్రమాదాల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా చర్యగా ఇసుకతో కప్పేస్తున్న ఆడ తాబేలు సైతం సముద్రపు నీటిలోకి వెళుతుందన్నారు. ఈ క్రమంలో ఫిబ్ర వరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో గ్రుడ్లు పొదిగే (హెచింగ్) సమయం కావడంతో గూళ్లలో ఉన్నగ్రుడ్లను రక్షించుకునేందుకు సముద్రంలోకి మరపడవలను నిషేదించడంతోపాటు తీరప్రాంతానికి 8కిలో మీటర్ల దూరంలో ఉంచాల న్నది అటవీశాఖ నిబంధనగా ఆయన పేర్కొన్నారు. పొదుగుతున్న తాబేలు గూళ్ళున్న ప్రాంతాల్లో వెదురుబొంగులు నాటి, తడికలతో కప్పి ఉంచి తగిన జాగ్రత్తలతో పొదిగిన పిల్లలను రక్షించి సముద్రంలోకి విడుదల చేసి



రక్షించుకోవడంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల న్నారు. తిమింగళలాలు, కుక్కలు, మరపడవల ప్రమాదాల వల్ల తొక్కిసలా టకు గురై ప్రతి వెయ్యి తాబేలు గ్రుడ్లనుంచి ఉత్పత్తి అవుతున్న పిల్లల్లో కేవలం ఒకటి మాత్రమే బ్రతుకుందనేది ప్రాథమిక అంచనా అని, సముద్ర గర్భంలోని తాబేలు జాతి ఊపిరి ఆడనిదే మనుగడ సాగించే పరిస్థితి కష్టతరమని, ఈపరిస్థితుల్లో ప్రతి 8 నుంచి 10 నిమిషాల్లోపు సముద్ర ఉపరితలంపైకి వచ్చి.. గాలి పీల్చుకొని తిరిగి యథావిధిగా సముద్రంలోకి వెళుతుందన్నారు. తక్షణ యాక్షన్ప్లాన్తో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రుడ్లు, పొదిగే సీజన్లకు సంబందించి ఆశించిన స్థాయిలో భద్రతా చర్యలు పెంచినట్లయితే తాబేళ్ళ సంఖ్య గణనీయంగానే పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు, కావలి రేంజ్ ఆఫీసర్లు ఎస్ మాల్యాద్రి, కె.రామిరెడ్డి అటవీ వన్యప్రాణి, ట్రీ ఫౌండేషన్ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## 10న అన్ని పాఠశాలల్లో మెగా పేటీఎం నిర్వహించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఈనెల 10వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో తల్లిదండ్రులకు ఉపాధ్యాయులతో మధ్య అవగహన, సత్ సంబంధాలు, విద్యార్థుల ప్రగతి, వారు సాధించిన లక్ష్యాలు, పొందిన మార్కులు, పురోభివృద్ధి, తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. ఈ సమావేశంలో విద్యా ర్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

## 15 లీటర్ల నాటు సారా స్వాధీనం, ఒకరు అరెస్టు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ రింగ్ నెల్లూరు పి.దయాసాగర్ ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కావలి శ్రీనివాసులు వారి సిబ్బంది, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ నెల్లూరు పి.అనిత సంయుక్తంగా కలిసి బోగోలు మండలం చెంచులక్ష్మి పురం గ్రామంలో నాటు సారా విక్రయాలు సాగిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఒకరీ ఇంటిలో అక్రమంగా నిర్వహించిన 15 లీటర్ల నాటసార కలిగి ఉండటంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అడిషనల్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కావలి కోర్టు నందు హాజరు పరిచినట్లు కావలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడులలో కావలి స్టేషన్ పిఎన్‌ఈఐ ఎస్ శ్రీనివాసులు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ నెల్లూరు పీ అండ్ ఈఐ పి.అనిత, కావలి స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజవోలులో సుపరిపాలన తొలిఅడుగు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం రాజవోలు, తాతి రెడ్డి పల్లి గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మండల టీడీపీ నాయకులు నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల టీడీపీ కన్వీనర్ అబ్బూరు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో రాజవోలు పంచాయతీ పరిధిలో తొలి ఏడాదిలో జరిగిన అభివృద్ధి సంక్షేమంపై ఇంటింటా తిరిగి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ దేవరాల హజరత్తయ్య రాజవోలు సర్పంచ్ నరసయ్య పెద్దబీపురం సర్పంచ్ అల్లంపాటి మాధవరెడ్డి టీడీపీ నాయకులు సూరం నవీన్ సూరం జనార్ధన్ రెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల ఆరో తేదీన తొలి ఏకాదశి పండుగ

- జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఈనెల ఆరవ తేదీన తొలి ఏకాదశి పండుగ జరుపుకో వాలని జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన ఈ పండుగపై మేజర్ న్యూస్‌తో మాట్లా డారు. ఆషాడ మాసంలో శుక్లపక్ష ఏకాదశినే తొలి ఏకాదశిగా జరుపుకుంటా మని వెల్లడించారు. సూర్యోదయం నుండి రాత్రి 9.14నిమిషాల వరకు ఏకాదశి ఘడియలు ఉన్నట్లు జ్యోతిష శిరోమణి తెలియజేశారు. విష్ణుమూర్తి నిద్రకు ఉపక్రమించే రోజు కనుక దీనినే శయన ఏకాదశి అని కూడా చెప్పవచ్చునని ఆయన పేర్కొన్నారు. పూజా కార్యక్రమాలకు ఉదయం 7.50 నిమిషాల నుండి 8.35 నిమిషాల మధ్య, ఉదయం వేళ 10.50 నిమిషాల నుండి 11.20నిమిషాల మధ్య విశేషమైన శుభ సమయం అన్నారు. ఈ నేపథ్యంలో విష్ణుమూర్తి, లక్ష్మీదేవి అర్చనలు చేసి నైవేద్యంగా కట్టు పొంగలి, పాయసం నివేదిస్తే సరిపోతుం దన్నారు. ప్రతి ఒక్కరు విష్ణు సహస్రనామ స్తోత్రం, శ్రీ సూక్తంపఠించండం వల్ల ఆ కుటుంబానికి మంచి ఫలితాలు ఉంటాయని అదేవిధంగా సౌభాగ్యాలు కలుగుతాయని జ్యోతిష్య శిరోమణి తెలియజేశారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు టౌన్ డివిజన్ అధీనంలో ఉన్న 33/11కేవీ వెంకటేశ్వరపురం సబ్ స్టేషన్ లోని 11కేవీ జనార్ధన్ రెడ్డి కాలనీ ఫీడరలో మరమ్మత్తుల కారణంగా జనార్ధన్ రెడ్డి కాలనీ పరిసర ప్రాంతాలలో శనివారం ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# జడ్పీలో ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో 'అల్లూరి సీతారామరాజు' జయంతి సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ అనం అరుణమ్మ మాట్లాడుతూ.. మన ఆత్మగౌరవం కోసం ప్రాణాలు అర్పించిన, స్వాతంత్ర్య సమరయోధుని 'అల్లూరి సీతారామరాజు' 128వ జయంతిని జరుపుకుంటున్నామన్నారు. మన దేశ చరిత్రలో పోరాట వీరులలో అల్లూరి సీతారామరాజు ది ఒక ముఖ్యమైన పేరు. అల్లూరికి చిన్నతనం నుంచే న్యాయమంటే ఆసక్తి, ధైర్యం అంటే గౌరవం కలిగిన వ్యక్తి అని అన్నారు. బ్రిటీష్ వారు ఆదివాసీల మీద అన్యాయంగా భూములు, అడవులు కబ్జా చేస్తూ, వారిని శోషణకు గురిచేస్తున్న సమయంలో, అల్లూరి ఈ దుర్మార్గానికి ఎదురుగా నిలిచారు అని అన్నారు. రంపా తిరుగుబాటుతో ఆయన ఆధ్వర్యంలో బ్రిటీష్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారు అని, ఆయన వీరత్వం, గెరిల్లా యుద్ధశైలి బ్రిటిష్ అధికారులకు భయాందోళన కలిగించిందని అన్నారు. ఇప్పటి తరానికి సీతారామరాజు జీవిత కథ ఒక మార్గదర్శం అని, మనం ఆయన్ని స్మరించుకోవడం మాత్రమే కాకుండా, ఆయన చూపిన మార్గంలో




నడవడం కూడా మన బాధ్యత అని అన్నారు. మన దేశాన్ని మరింత గొప్పదిగా తయారు చేయడానికి, అల్లూరి సీతారామరాజు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి పాటుపడాలని శపథం చేద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈవో మోహన్ రావు, అందరు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కోటంరెడ్డిని అభివృద్ధిలో ఆదర్శంగా తీసుకోవాలి



- **నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తులు కోటంరెడ్డి సోదరులు**
- **నెల్లూరు రూరల్‌లో సుపరి పాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి**

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రతి ఇంట్లో సంతోషం నింపుతోందని నెల్లూరు పార్ల మెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితో కలిసి 34వ డివిజన్ ప్రగతి నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధిలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గఎన్ని కల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం 10లక్షల కోట్ల అప్పు పెడితే.. వాట న్నింటినీ సరిచేస్తూ.. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా.. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించారని పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలో ప్రతి చోటా సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసి ప్రజల మనసు చూరగొన్నారని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ప్రశంసిం చారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సఫలీకృతుడయ్యారని అన్నారు. అందరి కోసం మంచి చేస్తున్న ముఖ్య మంత్రి చంద్రబాబుకి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తులు కోటంరెడ్డి సోదరులని ప్రశంసించారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ప్రతి ఒక్క నాయకుడు ప్రజల మధ్య ఉన్నారని అన్నారు. 3వ రోజు ప్రగతి నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు. అన్ని చోట్లా ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, అభివృద్ధి పనులు వేగవంతం అవుతున్నాయని ప్రజలు సంతోషంగా చెబుతున్నారన్నారు. ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మరింత ముందుకు సాగుతామని ఆయన వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు షంషుద్దీన్, సాబీర్ ఖాన్, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ చిలకూరి లక్ష్మిరెడ్డి, 34వ డివిజన్ అధ్యక్షులు షేక్ మస్తాన్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నదుల అనుసంధానానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్ర



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభు త్వం చేపడుతున్న నదులు అను సంధా నానికి అవరోధాలు కల్పించేందుకు తెలం గాణలోని కాంగ్రెస్, బీఆర్ ఎస్‌లు కుట్రలు చేస్తున్నాయని బిజెపి సీనియర్ నేత మిడతల రమేష్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కుట్రలకు వ్యతిరేకంగా శుక్రవారం పొదల కూరు తహసిల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ, జనసేన సంయుక్తంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసిల్దార్ శివకృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిడతల రమేష్ మాట్లాడుతూ.. వరద జలాలు అంటే ఏమిటి.? వాటిని ఎలా లెక్కిస్తారంటూ సిడబ్ల్యుసి ఏపీ ప్రభుత్వానికి రాస్తున్న లేఖల ప్రభావం జాతీయ నదుల అను సంధానంపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి జలాలను కృష్ణా జలాలతో బనకచర్ల రిజర్వాయర్లో కలిపితే ఎవ్వరికి నష్టం ఉండదని అన్నారు. ఓట్ల రాజకీయం కోసం తెలంగాణలోని కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ప్రాంతీయ విభేదాలు సృష్టించేందుకు కుట్రలు చేస్తు న్నాయని పేర్కొన్నారు. ఆంధ్రాలో ప్రాజెక్టులకు అనుమతులు రాకుండా కాల యాపన చేసే విధంగా తెలంగాణ ఇంజనీర్లు సిడబ్ల్యుసి అధికారులను ప్రభా వితం చేస్తున్నారని తెలిపారు. వంద సంవత్సరాల నదీ ప్రవాహాన్ని లెక్క కట్టి నికరజలాలు, వరద జలాలును రివర్ ట్రిబ్యునల్స్ ఖరారు చేశాయని గుర్తు చేశారు. నదీ ప్రవాహానికిపై ప్రాంతంలో ఉన్నవారు తమ అవసరాలకు అను గుణంగా నీటిని వినియోగించు కున్న తర్వాతే మిగిలిన నీటిని క్రింది రాష్ట్రంలోకి విడుదల చేస్తారని వివరిం చారు. ఈ లెక్కన తెలంగాణ సంపూర్ణ నీటి వినియోగం చేసిన తర్వాతే ఆంధ్ర భూభాగంలోకి నీటిని విడుదల చేస్తుందని ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టులు నిండిన తర్వాత మిగిలిన నీటిని సముద్రానికి మళ్ళిస్తున్నారని తెలిపారు. సముద్రంలో కలిసే నీటిని సద్వినియోగం చేసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతులు కోరితే వరద జలాలు ఎలా లెక్కిస్తారనీ సీడబ్ల్యూసీ ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్నారు. సముద్రంలో కలిసే నీటిపై అభ్యంతరాలు లేవనెత్తుతూ పోతే గోదావరి, కృష్ణ, పెన్నా, కావేరి నదుల అనుసంధానంపై ప్రభావం పడుతుందన్నారు. దేశంలో కానీ, ప్రపంచంలో కానీ నీటి ట్రిబ్యునల్స్ అవార్డుల ప్రకారం దిగువ ప్రాంతంలో ఉండే రాష్ట్రాలలో ప్రవహించే నీటిపై సంపూర్ణ హక్కులు కలిగి ఉంటాయని స్పష్టం చేసి ఉన్నాయని చెప్పారు. వృధాగా కడలి పాలవు తున్న నీటిని వినియోగంలోకి తీసుకుంటే త్రాగు, సాగునీటితో పాటు వృక్ష, జంతు జాతుల అభివృద్ధికి, ప్రజల జీవన అభివృద్ధికి ఆటంకాలు కల్పిం చడం మానవ జీవన అభివృద్ధిని అడ్డుకోవడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ మండల అధ్యక్షుడు పూల ప్రశాంత్, జనసేన మండల కన్వీ నర్ దాశినేటి అనీల్ కుమార్, జనసేన నాయకులు ఆనంద్, బిజెపి సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రమణ్యం, రాచపూటి ధనుంజయ రావు, దాసరి సురేంద్ర, బొడ్డు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీని ఆకస్మిక తనిఖీ

● **ఐవీఆర్ఎస్ కాల్స్ గురించి ప్రజలకు అవగాహన**



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి, జె.మోహన్‌రావు పెనుబల్లి గ్రామపంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. అందులో భాగంగా ఐవీఆర్ఎస్ కాల్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి గ్రీన్ అంబాసిడర్స్‌కు ఇవ్వవలసిందిగా తెలియజేశారు. అనంతరం గ్రామ సచివాలయంను పర్యవేక్షించి సచివాలయం సిబ్బందికి పి4 సర్వే గురించి సూచనలు ఇవ్వడం జరిగింది. వివిధ పథకాల లబ్ధిదారుల యొక్క వివరాలను తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఎం.నారాయణరెడ్డి, సర్పంచ్ పెంచలయ్య, పంచాయతీ సెక్రెటరీ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెంకట రమణయ్య ప్రథమ వర్ధంతికి హాజరైన ఎమ్మెల్సీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని 13వ డివిజన్ లక్ష్మి నగర్‌లో పెద్దలు నిమ్మల వెంకట రమణయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి శుక్రవారం వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై నిమ్మల వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి వెంకటరమణయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

## బోగోలులో సుపరిపాలన తొలిదశ కార్యక్రమం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణ రెడ్డి ఆదేశాలమేరకు బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీ 186వ బూత్ నందు సుపరిపాలన కార్యక్రమంను మండల టీడీపీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై, వారి సమస్యలకు పరిష్కారం చూపే లక్ష్యంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం, గ్రామాభివృద్ధికి నాంది పలుకుతోంది. ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం అందించే సేవలను ఇంటింటికీ చేర్చే మహోన్నత లక్ష్యంతో సాగాలని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో బోగోలు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్ బాబు, కోడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, బూత్ కో ఇన్‌చార్జి పేట శ్రీధర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట ప్రసాద్, అడపా ప్రసాద్, పొట్టేళ్ల హరిబాబు బంక జయరాజు, శివ కోటయ్య, సుజన్, గౌతమ్, ఎస్కే రఫీ, చిలకా జానకి రామయ్య, షేక్ అఖిల్, బొడ్డు ప్రభాకర్ రెడ్డి, నరసింహారావు, పార్టీ నాయకుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నెల్లూరు రూరల్ డివిజన్లో.. ట్రాన్స్ ఫార్మర్స్ ఫెయిల్యూర్‌పై దృష్టిసారించాలి

- సోలార్ విద్యుత్ వినియోగంపై విస్తృతంగా ప్రచారం
- వాట్సాఫ్ గవర్నర్ 9552300009 ద్వారా అన్నిరకాల సేవలు
- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆదేపూడి సోమశేఖర్‌రెడ్డి



**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, నెల్లూరు రూరల్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్లోని పరిధిలో ఎక్కువగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఫెయిల్యూర్స్ పై దృష్టిసారించి తక్షణ చర్యలతో తగ్గించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆదేపూడి సోమశేఖర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన మేజర్ న్యూస్తో మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం దిశగా రాష్ట్రప్రభుత్వం ప్రవేశ ఎట్టిన వాట్సాఫ్ గవర్నర్ 9552300009 ద్వారా అన్నిరకాల విద్యుత్ సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. వాట్సాఫ్ గవర్నర్ నెంబరు 9552300009ను ప్రతి ఒక్కరూ తమతమ మొబైల్‌లో ఫీడ్చేసుకోవాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లపై పెండింగ్లో ఉన్న సబ్ స్టేషన్/లైన్మెన్ తాలూకు మొబైల్ నెంబర్లు రాయాలన్నారు. ప్రస్తుతం క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లులు ఇవ్వడం జరిగిందని, వినియోగదారులు స్కాన్ చేసి సులభరీతిన బిల్లులు చెల్లించవచ్చన్నారు. నెల్లూరు రూరల్ డివిజన్ ఆధీనంలో ఉన్న అన్నిసెక్షన్ల పరిధిలో సోలార్ విద్యుత్ వినియోగంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని, ప్రజలు అవగాహన పెంచుకొని సౌరవిద్యుత్ వాడకం వైపు అడుగులు వేయాలని, విజయ – 2047లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే పిఎం సూర్యఘర్ పథకం, ఆర్డిఎస్ఎస్ పనుల ప్రక్రియలు వేగవంతం చెయాలన్నారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు భాధ్యతగా తీసుకొని పిఎం సూర్యఘర్ పథకం వల్ల చేకూరే బహుళ ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పునరుత్పాథక విద్యుత్ను ప్రోత్సహించాలని, పెండింగ్లో ఉన్నవర్క్ ఆర్డర్ను సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లు వెంటనే క్లోజ్ చేయాలన్నారు. విద్యుత్ సిబ్బందికి నిర్దేశించిన హెడ్ క్వార్టర్స్‌లోనే నివాసాలు ఉండాలని, స్థానికంగా అందుబాటులో ఉంటూ మెరుగైన విద్యుత్ సేవలందించాలని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం, సందేహాల నివృత్తి, ఇతరత్రా కార్యాలయ సేవలనిమిత్తం వచ్చే ప్రజలు, వినిగదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, పదేపదే కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చెయించకుండా.. సహనంతో సమస్యను తెలుసుకొని ఎన్నిరోజుల్లో సమస్యను పరిష్కరిస్తారో సంబంధిత సబ్డివిజన్, సెక్షన్ స్థాయిల ఇంజనీరింగ్ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సూచించారు. విద్యుత్ సంస్థకు రావాల్సిన పెండింగ్ బకాయిలపై దృష్టిసారించాలని, వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, డీసీ లిస్ట్ను పక్కాగా చేయాలని, ట్రాన్సా ఫార్మర్ మెయింటెయిన్స్ ప్రతిరోజు క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. ఆయా సెక్షన్ల అసిస్టెంట్ ఇంజనీర్లు ఫీల్డ్వర్క్ ద్వారా వాస్తవ పరిస్థితులు తెలుసుకొని అందుకనుగుణంగా వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని, వినియోగదారునికి సంతృప్తికర సేవలందించగలిగినప్పుడే సంస్థకు మంచి పేరు వస్తుందన్నారు. ప్రజల నిత్యవసరంలో భాగమైన 'మనవిద్యుత్ పంపిణీ సంస్థ అభివృద్ధి.. మనందరి భాద్యత' అన్న నినాదం ప్రతి ఉద్యోగికీ ఆచరణీయం కావాలని, విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు అసౌకర్యం కలుగకుండా అంతరాయ రహిత సేవలందించాలని. అభివృద్ధి పనుల నిమిత్తం విద్యుత్ అంతరాయం ఏర్పడే సందర్భంలో ముందస్తు పత్రిక ప్రకటన ద్వారా ప్రజలకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

# బీసీఉద్యోగులకు నివేశన స్థలాలు మంజూరు చేయాలి



- ప్రభుత్వమే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి
- ఏపీ బీసీ చైతన్య సమితి ఉద్యోగుల సంక్షేమ సంఘం
- రాష్ట్ర అధ్యక్షుడు ఆరంబాకం చంద్రశేఖర్

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని, భ్రుత్వమే పక్కా ఇళ్లు నిర్మించి సొంతింటి కలను సాకారం చేయాలని ఏపీ బీసీ చైతన్య సమితి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అద్యక్షుడు ఆరంబాకం చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి. బీసీ ఉద్యోగుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ పదోన్నతులు కల్పించాలని. పట్టభద్రులై ఉండి పదవీ విరమణకు రెండేళ్లు కాలపరిమితి ఉన్నబీసీ ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు. ఈ అంశాలపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు అర్జీలు దాఖలు చేయడం జరిగిందన్నారు. సదరు అర్జీలకు సంబందించి నెల్లూరు ఆర్డీవో ఆదేశానుసారం అర్బన్ తహసిల్దార్ కోరిక మేరకు పూర్తి స్థాయిలో వివరణ ఇవ్వడం జరిగిందన్నారు. ఏపీ రాష్ట్రంలో సాధారణ వాచ్మేన్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు విధులు నిర్వర్తిస్తున్న ప్రతి బీసీ కులస్థుడికి ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం లేదా నిర్మించబడి ఉన్న గృహాలు మంజూరు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ పథకం హౌస్ ఫర్ ఆల్ నందు ఇంటి స్థలం లేని ఉద్యోగులు సమీప సచివాలయాల్లో అర్జీలు దాఖలు చేసుకున్నట్లయితే సంవత్సర ఆధాయం రూ. 1,44,000 ఉన్నవారికి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి మాత్రమే ఇంటి స్థలం కేటాయించబడుతుందని తెలియజేస్తూ నివేదికలో పొందుపరచి ఉన్నట్లు తెలిపారు. పై ప్రస్థావిత విషయాల దృష్ట్యా ఇళ్ల కొరకు అర్జీలు దాఖలు చేసుకున్నట్లయితే అందుబాటులో నిర్మించబడి ఉన్న నెల్లూరు నగరపాలక సంస్థ, హౌసింగ్ శాఖకు వినతి పత్రాలు సమర్పించడం జరిగిందన్నారు.

# డీసీపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని డిసిపల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు మర్రిపాడు టిడిపి మండల అధ్యక్షుడు దేవరాల గంగాధర్ మరియు ఆత్మకూరు మార్కెట్ చైర్మన్ ఆరికట్ల జనార్దన్ నాయుడు సూచనల మేరకు డిసిపల్లి గ్రామంలో శుక్రవారం ఎంతో ఉత్సాహవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, రానున్న అమలు చేయబోతున్న పథకాలు, చేపట్టబోతున్న పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో టిడిపి ఉపాధ్యక్షుడు రెడ్డెం వంశీ రెడ్డి, టిడిపి నాయకులు తవ్వ రామ్మోహన్ రెడ్డి, కర్నాటి నారాయణరెడ్డి, నందీస్, రాచాల ఏడుకొండలు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సడ్డా రమేష్ రెడ్డి,



జనసేన నాయకులు పసుపులేటి హజరత్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపాడులో ప్రారంభమైన మొహరం వేడుకలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలో ముస్లిం సోదరులు మొహరం వేడుకలను శుక్రవారం ప్రారంభించారు. మండల పరిధిలోని పల్లవోలు, మర్రిపాడు, చుంచులూరు, నాగినేనిగుంట, కృష్ణాపురం, కదిరినేనిపల్లి, నందవరం, కృష్ణాపురం తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పీర్లను పురవీధుల్లో ఊరేగించారు. ఈ మొహరం వేడుకలు ఆయా గ్రామాల్లో మూడు రోజులపాటు కొనసాగున్నాయి. గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ పండుగను జరుపుతున్నారు.

# జేవీవీ జిల్లా మహాసభను జయప్రదం చేయండి



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో ఆదివారం జరిగే జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు కొక్కంటి పోలయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు జిల్లాలోని శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నగరం మున్సిపల్ కమిషనర్ వైఓ ఆనంద్, జెవివి గౌరవాధ్యక్షులు డాక్టర్ కే.నాగేశ్వరరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జి.సుధాకర్ రెడ్డి తదితరులు హాజరవుతారన్నారు. ఈ మహాసభలో కార్యదర్శి, ఆర్థిక నివేదికలతో పాటు నూతన కమిటీని కూడా ఎన్నుకోనున్నారని ఆయన పేర్కొన్నారు. కావున జన విజ్ఞాన వేదిక సభ్యులు మహాసభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

# అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు

- పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు మురళీమోహన్ రాజు




**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ ప్రభుత్వ దోపిడీ నుంచి మన్యం ప్రజలను కాపాడేందుకు 1922లో విప్లవ శంఖం పూరించి అగ్గిపిడుగుగా చరిత్ర పుటల్లో నిలిచిపోయారని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నెల్లూరు బాలాజీ నగర్ లోని గీతామయి బాలభవన్ నందు 'అల్లూరి సీతారామరాజు' జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ రాజు మాట్లాడుతూ.. ఆనాటి మైదానప్రాంత నాయకులెవ్వరూ వీరిని సమర్ధించకపోయినా మన్యం ప్రజల ఆధారాభిమానాలతో ఆంగ్లెయులపై అల్లూరి యుద్ధం చేశారు. అల్లూరి పట్టుకోలేని ఆంగ్లెయసేనలు సామాన్యులపై చేస్తున్న దాష్టీకాలు చూడలేక అల్లూరి సీతారామరాజు స్వయంగా లొంగి పోయి, తుపాకీ తూటాల వర్షానికి నేలకొరిగి, ప్రజల గుండెల్లో విప్లవ వీరునిగా నిలిచారని ఆయన సేవల్ని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు తమ్మినేని పాండు మాట్లాడుతూ.. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపకార్మిక కమీషనర్ డాక్టర్ రాచపాలెం రఘు, చేగు రాము తదితరులు పాల్గొన్నారు.

## చెత్త నుండి సంపద తయారీ కేంద్రమా?

# లేక చెత్తను తగలబెట్టే కేంద్రమా?

- ప్రభుత్వ ఆశయాలకు గండి
- అధికారుల ఆదేశాల మేరకే చెత్తను తగలబెట్టారు
- పర్యావరణ కాలుష్యానికి కారణం అవుతున్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రం






**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలం పరిధిలోనే పలుచోట్ల ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగాను, ఉపయోగ దారికంగా ఉండాలనే దృఢ సంకల్పంతో ఏర్పాటు చేసిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మరో చోట కొమ్మి పాడు గ్రామ సమీపంలోని రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన కేంద్రంలో చెత్త నుండి సంపదను తయారు చేయాల్సింది పోయి. సేకరించిన చెత్తను తగలబెడుతుండటంతో అందులో ప్లాస్టిక్ డబ్బాలు, వివిధ రకాలైన చెత్త ఉండడంతో అధికంగా పొగ వెలువడినందున రోడ్డుపై ప్రయాణం చేసే వాహన చోదకులు, ప్రయాణికులు, సమీపంలోని రైతులు, పలువురు ఇబ్బందులకు గురయ్యారు. చెత్త నుండి సంపద తయారు చేయాల్సిన కేంద్రంలో ఇలా రోడ్డు పక్కన చెత్తను తగలబెట్టి. పర్యావరణ కాలుష్యం చేయడం సరైనది కాదని, ఇకనైనా సంపదను తయారు చేసేలా కేంద్రంను ఉపయోగించుకోవాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. అయితే అధికారుల ఆదేశాలతోనే స్వీకరించిన చెత్తను తగలబెట్టడం కోస మెరుపు. ఈ విషయమై ఎంపీడీవో రవీంద్ర బాబును వివరణ కోరగా ఇలా చెత్తను తగలబెట్టకూడదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

# బాధితులకు సెల్‌ఫోన్‌లు అందించిన ఎస్పీ



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** పోలీసు వ్యవస్థ ప్రజలకు మరింత చెరువ కావడమే మా లక్ష్యం అంటూ జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలియజేశారు. కోటి విలువ గల 1000 ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ఆయన శుక్రవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మొబైల్ హంట్' మొబైల్ అప్లికేషన్ ద్వారా పోయిన తమ మొబైల్ ఫోను చేదించి పోగొట్టుకున్న బాధితులకు సులభతరంగా అందించడమే ఈ మొబైల్ హంట్ యొక్క ముఖ్య ఉద్దేశం మనీ ఆయన తెలియజేశారు. ఎవరైతే మొబైల్ ఫోన్‌ని పోగొట్టుకుంటారో వారు వాట్సాప్ ద్వారా 9154305600 నెంబర్కు మెసేజ్ పంపిస్తే వారికి గూగుల్ ఫామ్ లింక్ వస్తుందని దానిని పూరించి సీఈఐఆర్ పోర్టల్ నందు రిపోర్ట్ చేసిన ఎడల మీ ఫోన్ ట్రేస్ అయిన వెంటనే మీకు, మీ పరిధిలోని పోలీసు స్టేషన్‌కి పోర్టల్ ద్వారా ఎస్ఎంఎస్ సమాచారం చేరవేయబడుతుందని, తద్వారా ఆలస్యం లేకుండా మీ ఫోన్‌ను రికవరీ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మొబైల్ దొరికిన తర్వాత పోలీసులు బాధితులకు తిరిగి అందజేస్తారన్నారు. ఇప్పటి వరకు 8విడతల్లో నాలుగు కోట్లు విలువచేసే 3900 ఫోన్లను బాధితు లకు అందజేశామని, ఇంకా మిగిలిన మొబైల్ ను కూడా త్వరగా రికవరీ చేసి బాధితులకు అందజేస్తామని ఆయన తెలియజేశారు. అదేవిధంగా బిల్లు లేకుండా లేదా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్‌లను కొనరాదని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన సూచించారు. మొబైల్ హాండ్స్ సేవల ద్వారా జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మొబైల్ హంట్ యొక్క కార్యక్రమం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ సెల్, సాంకేతిక బృందం ఆధ్వర్యంలో విజయవంతంగా అమలవుతుందని ఈ యొక్క సైబర్ క్రైమ్ అనాలసిస్ బృందం, స్టేషన్ సిబ్బందికి జిల్లా ఎస్పీ తన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, జిల్లా పోలీసు అధికారులు, పోలీస్ సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

# భీమా ఉద్యోగులసంఘం ఆధ్వర్యంలో రక్తదానం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఎల్ఐసి ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ యూనియన్ శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రక్తదానశిబిరం నిర్వహించారు. తొలిమూడు రోజులు వివిద కార్యక్రమాలు నిర్వహించిన యూనియన్ నాయకులు ప్రజలకు అవసరమైన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కార్యాలయ సిబ్బంది, ఎల్ఐసి ఏజెంట్లు, పలువురు పట్టణ యువకులు స్వచ్ఛందంగా ఈశిబిరంలో పాల్గొని రక్తాన్ని దానం చేశారు. యూనియన్ నాయకులు, వివిద సంఘాల ప్రతినిధులు ఈసందర్భగంఆ ప్రసంగిస్తూ రక్తదానం ఎందరికో ప్రాణదానం కాగలదని, అందుకే యూనియన్ ఆధ్వర్యంలో ప్రతిఏటా వివిద కార్యక్రమాలతోపాటు రక్తదానశిబిరాలను కూడా నిర్వమిస్తుంటామన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తం మార్కెట్‌లో లభించేదికాదని, ఎవరైనా స్వచ్ఛందంగా ఇస్తేనే వారిని ఆదుకోగలమని, క్షతగాత్రులను ఆదుకోవాలన్న లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు. ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల సేవానిరతిని పలువురు అతిధులు కొనియాడి అబినందించి భవిష్యత్తులో ఇలాంటి రక్తదానాలు విరివిగా నిర్వహించాలని కోరారు. ఉద్యోగ పరంగా ప్రజలకు సేవలందిస్తూనే యూనియన్ పరంగా సామాజికసేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షదాయకమన్నారు. జీవితభీమాసంస్థ ఉద్యోగుల సంఘం ఆత్మకూరు శాఖ అధ్యక్షుడు టి.రమేష్, కార్యదర్శి శ్యామ్‌ప్రభాకర్, నాయకులు సాయితేజ, రమాదేవిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో టీడీపీ నాయకుడు చంద్రా వెంకటసుబ్బానాయుడు, సిపిఎం పట్టణ కార్యదర్శి కె.డేవిడ్‌రాజు, ఆత్మకూరు రెడ్‌క్రాస్‌సొసైటి ప్రతినిధి మొహ్మద్ సాధిక్‌హుస్సేన్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్ షేక్ సంధాని, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వాగాల శ్రీహరి, కెవిపిఎస్ నాయకుడు ఆత్మకూరు నాగయ్య, సురేష్‌బాబు తదితరులు



పాల్గొన్నారు. వారందరికీ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు రమేష్, శ్యామ్ ప్రభాకర్‌లు ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతో భవిష్యత్తులో ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని నాగులబావివీధి, గుంతబజార్లో మొహర్రం ప్రార్థనలను ముస్లిం సోదరులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చావిళ్లలో పీర్లను ప్రతిష్టించి ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టారు. గుంతబజార్ పీర్లచావిడిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. రాత్రికి మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో పెద్ద పీర్ల ఊరేగిం పును వైభవంగా చేపట్టారు. నిర్వాహకులు రాత్రికి భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చావిళ్లను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

## రొట్టెల పండుగ ఏర్పాట్లు పై సీఐ పరిశీలన

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** రొట్టెల పండుగ సందర్భంగా పోలీస్ శాఖ ఏర్పాట్లను శుక్రవారం సంగం సీఐ కె.వేమారెడ్డి స్థానిక ఎస్ఐ ఏ.సైదులుతో కలిసి పరిశీలించారు. పండుగ సందర్భంగా దర్గాకు వచ్చే రహదారులు లతోపాటు వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. భక్తులకు కల్పించాల్సిన బందోబస్తు దర్గాలో క్యూ లైన్‌ల ఏర్పాట్లకు సంబంధించి ఎస్ఐకి తగు సలహాలు సూచనలు చేశారు. సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుతం రొట్టెల పండుగకు 80 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నెల్లూరు వైపు నుండి వచ్చే వాహనాలను మియాజాన్ తోటలో, ఆత్మకూరు నుండి వచ్చే వాహనాలు ఖాజా మైదాన్ తోపాటు పీర్ల మన్యంలో వాహనాలు పార్కింగ్ చేసేటట్టు పరిశీలించామన్నారు. రొట్టెల పండుగకు వచ్చే భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారి దర్శనం చేసుకొని తిరిగి వెళ్లేలా పోలీస్ శాఖ తరపు నుండి అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

## కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణ శివారు ప్రాంతం గండిపాళెం మార్గంలో చుక్కల దుప్పిపై కుక్కల దాడి చేయడంతో అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. సమీప అటవీ ప్రాంతం నుంచి తాగునీటి కోసం పట్టణ శివారు ప్రాంతానికి వచ్చిన దుప్పి పై ఊరకుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో దుప్పి తీవ్రంగా గాయపడి రోడ్డుపక్కన కొనఊపరితో కొట్టుమిట్టాడుతోంది. అటుగా వాకింగ్ వెళ్లిన కొందరు గుర్తించి దానిని రక్షించే ప్రయత్నం చేసినా ప్రయోజనం శూన్యమైంది. ఈ విషయాన్ని స్థానికులు రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాకు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు ఎఫ్ఎ శ్రీరాములు, ఎల్బీవో ఆష్వల్ సంఘటనా స్థలానికి చేరుకుని దుప్పిని పరిశీలించారు. అనంతరం దుప్పిని గండిపాళెం పశు వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి రిజర్వు ఫారెస్టులో దహనం చేశారు.

## సుపరిపాలనకు తొలి అడుగు.. ఇంటింటికీ టీడీపీ



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు టీడీపీ చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం మూడో రోజు ఊపు తీసుకుంది. వెంకటాచలం మండలంలోని తాటిపర్తిపాళెం గ్రామంలో ఈ రోజు టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, ఏపీ ఇన్‌లాండ్ వాటర్ వేస్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జెడ్. శివప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు దావా పెంచలరావు కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రజలు వారికి ఘన స్వాగతం పలుకుతూ, ప్రభుత్వ పథకాల పట్ల తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఏడాది టీడీపీ కూటమి పాలనలో అమలైన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, భవిష్యత్తు ప్రణాళికలపై ప్రజలకు విపులంగా వివరించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి అన్నారు. 'ఇంటింటికీ వెళ్లడం మన పాలనకు అద్దం పడుతుంది. ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకోవడం వల్ల మరింత ప్రభావవంతంగా సేవలందించగలుగుతున్నాం.' ప్రజల ఉత్సాహం, నాయకుల చొరవతో తాటిపర్తిపాళెంలో టీడీపీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ప్రజల మనసు గెలవడమే తమ లక్ష్యమని నేతలు స్పష్టం చేశారు.

## టీడీపీ కార్యక్రమాలపై ఇంటింటా ప్రచారం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండలం గండవరం గ్రామపంచాయతీలో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సంవత్సరం రోజుల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఆలం మాలకొండయ్య, ఇరిగేషన్ ప్రెసిడెంట్ కంచి ఈశ్వర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ బ్రహ్మానంద రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధే మా నినాదం సంక్షేమమే మా విధానం

- అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించండి
- ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం ద్వారా ప్రజలతో పార్టీకి అనుబంధం పెరుగుతుంది
- విద్యాశాఖ మంత్రి లోకేష్ సారధ్యంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతం అయింది
- ప్రజలతో మమేకమై ఏడాది పాలనలో ప్రభుత్వ విజయాలు వివరించండి
- నియోజకవర్గ అభివృద్ధి కోసం సిఎస్ఆర్ నిధులు అందచేస్తున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ధన్యవాదాలు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** పేదలకు మంచి చేయాలన్న ఏకైక లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఇందుకూరుపేట మండలంలోని డేవిస్ పేట,జగదేవి పేట గ్రామాలలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్సీ బీదా రవిచంద్రతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి మహిళలు అపూర్వ స్వాగతం పలికారు. ఆమె ప్రజల నుంచి ఇళ్ళు, ఇళ్ల స్థలాలు, పెన్షన్లకు సంబంధించిన వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. ఎక్కడికెళ్ళినా చాలా మంచి ప్రభుత్వమని ప్రజలు ప్రశంసిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ప్రభుత్వం అమలు చేసిన పెన్షన్ల పెంపు, ఉచిత సిలెండర్లు, తల్లికి వందనం పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. విద్యాశాఖామంత్రి లోకేష్ చేపట్టిన విద్యా సంస్కరణలు సత్ ఫలితాలిస్తున్నాయన్నారు. గతంలో నాలుగైదు తరగతులకు ఒకే టీచర్ ఉంటే ఇప్పుడు క్లాస్‌కు ఒక టీచర్ నియామకం చేసాక ప్రజలు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చదించేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. నాణ్యమైన భోజనం, విద్యా కిట్లు అందచేసి ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేట్ పాఠశాలతో పోటీ పడేలా అభివృద్ధి చేశారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడాన్ని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవతో పాటు ఆగస్టు 15 నుంచి మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత బస్సు సోకార్యం కల్పిస్తున్నామన్నారు. త్వరలో పేదలకు ఇళ్ళు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామన్నారు. స్థానిక నాయకులు ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజలకు తెలియచేయాలని కోరారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం సిఎస్ఆర్ నిధులు అందచేస్తూ విపిఆర్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలకు సహాయం అందిస్తున్న ఎంపి వేమిరెడ్డి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిధన్యవాదాలు తెలియజేశారు.

### ప్రజాసేవ చేసేందుకే ఎమ్మెల్యే రాజకీయాలలోకి వచ్చారు : ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు సేవ చేయడంతో పాటు కోవూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న తపనతో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పని చేస్తున్నారన్నారు ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో కలిసి ఇందుకూరుపేట మండలంలోని డేవిస్ పేట, జగదేవి పేట గ్రామాలలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. అన్ని నియోజకవర్గాలకు రాష్ట ప్రభుత్వ నిధులు మాత్రమే వస్తుంటే కోవూరు నియోజకవర్గంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ద్వారా కేంద్ర నిధులు కూడా వస్తున్నాయన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలలోనికెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని కోరారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సేవలను ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర ప్రశంసించారు. ఈకార్యక్రమంలో ఇందుకూరుపేట టిడిపి మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు. కళ్యాణ్ రెడ్డి,చెచుకిషోర్ యాదవ్ కోడూరు. కమలాకర్ రెడ్డి, స్థానిక నాయకులు తన్నీరు మధు, కూకటి వెంకటేశ్వర్లు, కుదురు రాధయ్య, బొల్లినేని హరి నాయుడు, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో వైద్య విద్యకి తూట్లు

## వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో వైద్య విద్యకి తూట్లు పొడిచారని జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రిత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసపూరిత వాగ్దానాలు చేయడం పరిపాటిగా మారింది అన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య విద్యలోకి పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్) విదానాన్ని తీసుకురావడం చాలా బాధాకరం అన్నారు. ఈ విదానం ద్వారా వైద్య కళాశాలలు కార్పొరేట్ శక్తుల చేతిలోకి వెళ్లిపోయి ఎంబీబీఎస్ చదువుకోవాలనే పేద విద్యార్థుల కలలు నాశనం అవుతాయి అన్నారు. అంతేకాకుండా కళాశాలకి అనుసందానంగా ఉండే జనరల్ హాస్పిటల్ లో ఎన్నో లక్షల మంది పేదవారు ఉచితంగా వైద్యం చేయించుకోలేరని వివరించారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దేశంలో ఎక్కడా ఎప్పడు లేని విధంగా 17 వైద్య కళాశాలలు నెలకొల్పేలా ఆదేశాలు ఇచ్చారు, అంతేకాకుండా మొదటి దఫాగా నిర్మాణ పనులకు 2500 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగింది అన్నారు. సుమారు 80శాతం పూర్తి అయిన కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ శక్తులకు దారదత్తం చేయడం బాధాకరం అన్నారు. వైద్య కళాశాలలు తాము నిర్వహించలేమని 1800 సీట్లు వెనక్కి తీసుకోవలసిందిగా అని ప్రభుత్వం ఇండియన్ మెడీషియల్ కమిషన్ కు లేఖ రాయడం సిగ్గుచేటుని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం ఉదయం నెల్లూరు జిల్లా కమిటీ లోని సభ్యులు అదేవిధంగా జిల్లా లోని అన్ని నియోజకవర్గ కమిటీలతో కలిసి విజయవాడ లోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ గారిని కలిసి వైద్య విద్యార్థుల గోడు వెళ్లబోస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సతీష్ బాబు, నెల్లూరు రూరల్ అధ్యక్షుడు రోహిత్ రెడ్డి, కావలి అధ్యక్షుడు పామాంజి శ్యామ్, కందుకూరు అధ్యక్షులు అశోక్, సర్వేపల్లి అధ్యక్షులు హేమంత్, ఆత్మకురు అధక్షులు విష్ణు,వెంకీ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలో అల్లూరి జయంతి వేడుకలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి1 అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షకీలా ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పిలుపుమేరకు ఈకార్యక్రమాన్ని షకీలా నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి షకీలా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరు సీతారామరాజు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని వీరోచితంగా పోరాటాలు సాగించిన వివరాలను ఆమె చిన్నారులకు వివరించారు. అందరూ అల్లూరిని స్మరించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్ర సహాయకురాలు విజయ, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.




నేటి దినపత్రిక సూర్య

# విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, అనంతసాగరం, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9000483583

# శ్రీ ద్రౌపతీదేవి మాన సంరక్షణ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేట లోని శ్రీ కృష్ణ ధర్మరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల లో భాగంగా శుక్ర వారం ఉదయం చప్పర ఉత్సవం ఘనంగా నిర్వించారు. రాత్రి శ్రీ ద్రౌపతీదేవి మాన సంరక్షణ నిర్వ హించారు. ద్రౌపది మాన సంర క్షణ అంటే మహాభారతంలో ద్రౌపదికి జరిగిన అవమానం, ఆమె పట్ల జరిగిన అన్యాయాన్ని సూచిస్తుంది. ముఖ్యంగా, జూదంలో ఓడిపోయిన తర్వాత కౌరవులు ఆమెను సభలోకి లాక్కొని అవమానించిన సందర్భాన్ని ఇది వివరిస్తుంది. ఈ సంఘటనలో, కౌరవులు ఆమెను వివస్త్రను చేయడానికి ప్రయత్నించినప్పుడు, కృష్ణుడు ఆమెకు అండగా నిలిచి, ఆమె వస్త్రాలను అపరిమితంగా పెంచి, ఆమె పరువును కాపాడాడు. ఈ కార్యక్రమం ఆలయ కార్యనిర్వహణాధికారి జానకమ్మ ఆధ్వర్యంలో ఉభయకర్తలు, ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు వారి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకను తిలకించడానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## మంత్రి ఆనం పర్యటన నేడే : తుమ్మల



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయశాఖామాత్యులు ఆనం రామ నారాయణరెడ్డి శనివారం ఆత్మకూరులో పర్యటించనున్నారని పట్టణ తెలుగు దేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఉదయం9.30గంటలకు పట్టణంలో 22వవార్డుపరిధిలోని వీవర్స్‌కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి ఆనం పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం 3గంటలకు ఏఎస్‌పేట మండలం కుప్పురుపాడులో సుపరిపాలనలోతొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారన్నారు. ఆదివారం ఉదయం 9.30గంటలకు సంగం మండలంలోని కోలగట్లలో రామనారాయణరెడ్డి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారని, అదేరోజు మధ్యాహ్నం 3గంటలకు ఆత్మకూరు పట్టణంలోని జెఆర్‌పేటలో వినాయక టెంపుల్ వీధిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి ఆనం పాల్గొంటారని తుమ్మల పేర్కొన్నారు. ఈకార్యక్రమాల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ఆయాప్రాంతాల ప్రభుత్వ సిబ్బంది, అధికారులు, టిడిపి కార్యకర్తలు, వివిద కమిటీల ప్రతినిధులు, అభిమానులు, ప్రజలు పాల్గొనాలని చంద్రారెడ్డి కోరారు. మంత్రి ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటిస్తారని ఆయన తెలిపారు.

# ఆత్మకూరులోని 14వవార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని 14వవార్డులోశుక్రవారం పట్టణ తెలుగుదేశం ప్రధానకార్యదర్శి తోడేటి వెంకటయ్యయాదవ్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలమేరకు నిర్వహించిన ఈకార్యక్రమంలో 14వవార్డు మున్సిపల్ కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్యయాదవ్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికెళ్ళి తెలుగుదేశం, జనసేన, బిజెపిల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈఏడాదిపాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధి, ప్రజలకందిస్తున్న సంక్షేమఫలాలు, పరిష్కరిస్తున్న సమస్యలు గురించి ప్రజలకు వివరించడంతోపాటు ఆ వివరాలతో కూడిన కరపత్రాలను అందరికీ అందజేశారు. ఇప్పటికే ఈఏడాదిలో అమలుచేసిన ఎన్నికలనాటి హామీలైన పెన్షన్‌పెంపు, మెగా డిఎస్‌సి,ఉచితంగా గ్యాస్‌సిలిండర్లు, విద్యార్థులకు తల్లికివందనం నగదు జమ తదితరాలను వివరించారు. ఈనెలలో అన్నదాతసుఖీభవ, వచ్చేనెల15నుండి మహిళలకు ఉచితబస్‌సౌకర్యం, అనంతరం ఆడబిడ్డనిధి అమలు చేయనున్నామని వెంకటయ్య, పెంచలయ్యలు ప్రజలకు వివరించారు. ఇంటింటా ఏదేని సమస్యలున్నాయని అని అడిగి తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వార్డులో రోడ్డు, డ్రైన్ సమస్యలను



మంత్రి రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. గడపగడపకు వెళ్ళి కరపత్రాలందజేసి ప్రభుత్వ పథకాలు పొందుతున్నారాలేదా అని అడిగి తెలుసుకోవడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపు అయిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో టిడిపి బిసి నాయకుడు అంబటి నాగేశ్వరరావు, టిడిపి సాంస్కృతికవిబాగం కోశాధికారి ఒంటేరు మల్లికార్జున, టిడిపి నాయకులు పసుపులేటి సుబ్బారావు, సలీమ్, పలువురు టిడిపి కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ సాంస్కృతికవిభాగం ఉపాధ్యక్షుడుగా సీనియర్ కళాకారుడు చాంద్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సీనియర్ రంగస్థల కళాకా రుడు, మేకప్‌మెన్, రచయిత, శ్రీరామానాట్య మండలి కోశాధికారి, విశ్రాంత ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పఠాన్ చాంద్‌బాషా ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం సాంస్కృతికి విభాగం ఉపాధ్యక్షుడుగా నియమితులయ్యారు. ఈమేరకు కమిటీ అధ్యక్షుడు నాగులూరు చిన్నబ్బయ్య ప్రకటించారు. చాంద్‌బాషా రెండు దశాబ్దాలుగా శ్రీరామానాట్యమండలి కోశాధికారిగా, కళాకారుడుగా ఉంటూ 205నాటకప్రదర్శనలిచ్చారు. నాటినుండి ఆయ న మేకప్‌మెన్‌గా కొనసాగుతున్నారు. రచయితగా భావ వీచికలు అనే పుస్తకాన్ని రచించారు. ఆయన సత్యహరి శ్చంద్ర నాటకంలో విశ్వామిత్రుడుగా, కాలకౌశికుడుగా, బాలనాగమ్మ నాట కంలో మాయలఫకీరుగా, భక్తచింతామణి నాటకంలో సుబ్బిశెట్టిగా పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులకు వినోదం అందించి తన నటనతో శెహభాష్ అన్పించు కున్నారు. ఉపాధ్యాయుడుగా అంకితభావంతో విధులు నిర్వహించడంతోపాటు సామాజికస్పృహతో డ్రాపవుట్లను బిడిలో చేర్చేందుకు అనేకవిదాలుగా పట్టుదలగా కృషిచేశారు. దాంతోపాటు కళలపట్ల తనకున్న మక్కువతో తొలుత సాంఘికనాలటకాల్లో పాత్రలు పోషించారు. అనంతరం శ్రీరామానాట్యమండలి సభ్యుడై తన మిత్రబృందంతో రంగస్థలంపై కాలుమోపి 205నాటక ప్రదర్శనలిచ్చారు. ఆయన నాట్యమండలి కోశాధికారిగి అనేక పేద కళాకారుల సంక్షేమం కోసం, వారికి వృద్ధ కళాకారుల పెన్షన్ మంజూరుకు ప్రత్యేకశ్రద్ధతో కృషిచేశారు. తయనను తెలుగుదేశం నాయకులు గుర్తించి టిడిపి సాంస్కృతిక విబాగం ఉపాధ్యక్షుడుగా నియమించారు. ఆయనను శ్రీరామానాట్యమండల అధ్యక్షుడు సోమావెంకటసుబ్బయ్య, ప్రధానకార్యదర్శి జి.సత్యంబాబు, కార్యవర్గసభ్యుడు దేవరపాటి చిన్నబాబు, చిన్నా, పలువురు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, వివిద ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందించారు.

# రొట్టెల పండుగ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయండి : కమిషనర్

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** ఆదివారం నుంచి రొట్టెల పండుగ ప్రారంభమవుతున్న సందర్భంగా నిర్వహణ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. బారా షహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగ ఏర్పాట్లను వివిధ విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణంలో షామియానాలు, కమాండ్ కంట్రోల్ విభాగం, వీఐపీ రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ, బయో టాయిలెట్ల ఏర్పాటు, పార్కింగ్, బారికేడ్ల నిర్మాణం, జోన్ల వారిగా హెల్ప్ డెస్కుల ఏర్పాటు, స్వర్ణాల చెరువు తీరం వెంబడి భద్రతా చర్యలను కమిషనర్ పరిశీలించారు. రొట్టెల పండుగకు రానున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పండుగ జరిగే అన్ని రోజులలో దర్గా ప్రాంగణంలో అన్ని వసతులు ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నామని తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుంటూ, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో



రొట్టెల పండుగను నిర్వహించేందుకు కృషి చేయనున్నామని కమిషనర్ వెల్లడించారు. పండుగకు విచ్చేసే భక్తులంతా క్రమశిక్షణగా రొట్టెలు మార్చుకునేలా, దర్గాలో మొక్కులు చెల్లించుకునేలా పటిష్ట ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం కావలి యడవల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో పనిచేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా బదిలీ కాబడిన హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఓ.వెంకటేశ్వరరావు ఆంగ్ల ఉపాధ్యాయులు ఇస్మాయిల్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులైన సుధాకర్ పీఈటీ ఉపాధ్యాయులైన గురవయ్య గణిత ఉపాధ్యాయులు నారె శ్రీనివాసులు అలాగే ఎంపీపి కావలి యడవల్లి మెయిన్ స్కూలు హెచ్ఎం పూజల హరిబాబును గ్రామ పెద్దలు, మాజీ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు ఏలూరు మాల్యాద్రి నాయుడు , గ్రామ సర్పంచ్ ముప్పూరి ధనమ్మ, వార్డు మెంబర్ మన్నం మోహన్ రావు విద్యా కమిటీ చైర్మన్ లు, ప్రత్యేక ఆహ్వానితులైన రాయం వెంకటేశ్వర్లు పాఠశాల పూర్వ విద్యార్థి నాగినేని మస్తాన్ సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు బదిలీ అయిన ఉపాధ్యాయులకి ఘనంగా సన్మానించి మొమెంటోలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఏలూరు మాల్యాద్రి నాయుడు మాట్లాడుతూ.. ఇటువంటి ఉపాధ్యాయులు దొరకడం తమ అదృష్టమని, వీరి హయాంలో పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం, ప్రతి సంవత్సరం త్రిబుల్ ఐటీలో సీట్లు సంపాదించడం, పాఠశాల నుండి ప్రతి సంవత్సరం ఎన్ఎం ఎంఎస్ స్కాలర్షిప్పులు పొందడానికి ఎంతగానో కృషి చేసిన ఉపాధ్యాయులందరికీ, అభినందనలు తెలియజేశారు,

## టీడీపీ సాంస్కృతికకమిటీ కార్యదర్శిగా కిన్నెర



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్(పట్టణ) తెలుగుదేశం సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా స్థానిక వాయిద్యకళాకారుడు కిన్నెర నరశింహరావు నియమితులయ్యారు. అధ్యక్షుడుగా నాగులూరు చిన్నబ్బయ్య నియమితులై పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెల్సిందే. ఈకమిటీలో కార్యదర్శిగా నియమితులైన కిన్నెర గతంలో ఐదేళ్ళపాటు ఆత్మకూరు మండల నాయీబ్రాహ్మణసహకారసంఘం అధ్యక్షుడుగా, ఎల్‌ఆర్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీ సభ్యులుగా వ్యవహరించారు. మండలస్థాయిలో, పట్టణంలో గుర్తింపు కలిగిన నరశింహరావు మండల, మున్సిపల్ స్థాయిలో తమ సామాజికవర్గానికి నాయకుడుగా వ్యవహరిస్తుంటారు. ఆయన ఆత్మకూరు పట్టణంలోని జెఆర్‌పేటలో ఉన్న శ్రీవినాయకస్వామి మండపంకమిటీ సభ్యులుగా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా నరశింహరావు మాట్లాడుతూ.. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తనకు పెంచలకోనలోని శ్రీపెనుశిలనరశింహస్వామి ఆలయ ఫెస్టివల్‌కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించారని, పట్టణ తెలుగుదేశం నాయకులు పార్టీ సాంస్కృతిక విభాగంలో కార్యదర్శిగా అవకాశం కల్పించడం అత్యంత సంతోషదాయకమని, తనవంతుగా కళాకారుల సంక్షేమానికి, కళల ప్రోత్సాహానికి కృషిచేస్తానని, తనకు అవకాశం కల్పించిన మంత్రి ఆనంకు, పట్టణ తెలుగుదేశం నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలని నరశింహరావు పేర్కొన్నారు. ఆయనను శ్రీరామానాట్యమండల అధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య, ప్రధానకార్యదర్శి జి.సత్యంబాబు, కార్యవర్గ సభ్యుడు దేవరపాటి చిన్నాబాబు, పలువురు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, వివిద ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందించారు.

## సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారం



**కొండాపురం, మేజర్‌న్యూస్ :** మండలం 218 బూత్‌లోని ఆదిమూర్తిపురం గ్రామంలో మాజీ మండల తెలుగు యువత అధ్యక్షుడు. నీటి సంఘం చైర్మన్ జాగర్లమూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతి గడపకు వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురించి వివరిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల గురించి డోర్ టు డోర్ తిరిగి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ మంచాల ఏడుకొండలు, అయితా వెంకటేష్, పాటిబండ్ల వేణు, పోలినేని మాల్యాద్రి, కొల్లా రామకృష్ణ, తలపనేని నరసపనాయుడు, సీనియర్ నాయకులు ఐతా నారాయణ, తులిబిల్లి రాయుడు, బిల్లా హజరత్, ఇంకా టీడీపీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రొట్టెల పండుగ ఏర్పాట్లపై సమీక్ష



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** రొట్టెల పండగ సందర్భంగా ఏఎస్ పేట లోని శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దర్గాకు వచ్చే భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు పై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో ప్రసన్నకుమారి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ యంత్రాంగంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, వాహనములు పార్కింగ్ బందో బస్తు అంశములపై చర్చించారు. అనంతరం దర్గా పరిసర ప్రాంతాలు, వాహనాలు నిలుపు స్థలను మండల అధికారులు పరిశీలించారు. దర్గాకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# డిల్లీలో ఆత్మకూరు వాణి విన్పించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** డిల్లీ ప్రాంతంలోని హర్యానారాష్ట్రంలోని గురుగ్రామ్‌లో నిర్వహించిన అర్బన్‌ప్రజాప్రతినిధుల జాతీయ సదస్సులో ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ పాల్గొని ఆత్మకూరు వాణిని విన్పించారు. మున్సిపాలిటీలు, కార్పోరేషన్ల చైర్మెన్లు, మేయర్లకు జాతీయస్థాయిలో కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా వర్క్‌షాపు నిర్వహించారు. అందులో అన్నిరాష్ట్రాలనుండి వందలాది మంది ప్రతినిధులు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్‌నుండి 25మంది ప్రజాప్రతినిధులు మాత్రమే పాల్గొన్నారు. అందులో నెల్లూరు జిల్లానుండి నెల్లూరు కార్పోరేషన్ డిప్యుటిమేయర్, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌లు ఇద్దరు మాత్రమే పాల్గొనేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మకు అరుదైన ఈ అవకాశం లభించింది. పిన్నవయసులోనే ఆమెకు జాతీయస్థాయిలో నిర్వహించిన సదస్సులు పాల్గొనే, ప్రసంగించే అరుదైన అవకాశం లభించింది. అర్బన్ పాలకవర్గాలను బలోపేతం చేయడం, రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలు, పరిణామాలను వివరించి పటిష్టం చేసేలా జాతీయస్థాయిలో ప్రభుత్వం వర్క్‌షాపు నిర్వహించారు. ఈసదస్సుకు హాజరైన వెంకటరమణమ్మ ప్రసంగించి పలు సూచనలు చేసి ఆత్మకూరు వాణిని విన్పించారు. అర్బన్‌స్థానికసంస్థలను ఏవిధంగా బలోపేతం చేయాలని, అబివృద్ధి, సంక్షేమానికి ఏవిధంగా దోహదపడాలనే విషయం, ఎలాంటి అధికారాలు కావాలి అనే అంశాల గురించి వెంకటరమణమ్మ సదస్సులు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు అబించిన ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకొని సదస్సులో తన అభిప్రాయాలను, సూచనలను వివరించానని, ప్రజాప్రతినిధుల అధికారులు, హక్కులు,విధుల గురించి తనవంతుగా ప్రసంగించానని పేర్కొన్నారు. జాతీయస్థాయి సదస్సులో పాల్గొన్న చైర్‌పర్సన్ వెంకటరమణమ్మను మున్సిపల్ వైస్‌చైర్మెన్, కౌన్సిలర్లు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిద ప్రజాసంఘాల ప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రతినిధులు తదితరులు అభినందించారు.



# కెరియర్ గైడెన్స్ అండ్ మోటివేషన్ కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం కెరియర్ గైడెన్స్ అండ్ మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత ఐపీఎస్ అధికారి వెలుగోటి రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలోని 9,10 తరగతుల విద్యార్థులకు జ్ఞాపక శక్తిని ఎలా పెంచుకోవాలి.. పేదరికం నుంచి ఎలా బయటపడాలి.. ఏ విధంగా అభివృద్ధి లోకి రావాలి అనే కెరియర్‌ని మన ఆసక్తులకు అనుగుణంగా ఎలా మరలించు కోవాలి అనే విషయం మీద ఉపన్యాసం ఇచ్చారు విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. చదువుకో పేదరికం అడ్డు కాదని తెలిపారు ఎంతోమంది కార్మికులు ఆటో రిక్షాలు బేల్దారీలు తమ పిల్లలను చక్కగా చదివించి ఉన్నత స్థానాలలో నిలిపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. విద్యార్థులు మొదటి నుండి ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు పొందడం సులభంగా ఉంటుందన్నారు దాంతో తన పేదరికాన్ని జయించవచ్చని తెలిపారు. ముఖ్యంగా తన కెరియర్ను సక్రమమైన మార్గంలో మలుచుకోవాలని తెలిపారు విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా మనసుపెట్టి వినాలని తద్వారా వాటిని చదివినట్లయితే పూర్తిస్థాయిలో జ్ఞాపకం ఉంటుందన్నారు. బట్టి విధానాన్ని కాకుండా సృజనాత్మకతతో ఆలోచించి జవాబులు రాయాలన్నారు. అప్పుడే మనలో ఉన్న సృజనాత్మకత మేధాతనం ఉట్టిపడుతుందన్నారు. విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు ఓపికగా సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎల్వీ సీతారామయ్య ప్రధానోపాధ్యాయు రాలు పి.నాగలక్ష్మి ఉపాధ్యాయ బృందం విద్యార్థినులు ఉన్నారు.

# నేడే జాతీయ లోక్ అదాలత్

▶ జిల్లా జడ్జి శ్రీనివాస్ ప్రారంభం ▶ హాజరు కానున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ




**నెల్లూరు, లీగల్, మేజర్‌న్యూస్ :** జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జి శ్రీనివాస్ ప్రారంభించనున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి. సీనియర్ సివిల్ జడ్జ్ కే.వాణి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగనుంది నగరంలోని వివిధ కోర్టుల న్యాయమూర్తులతోపాటు ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ నందన్, బ్యాంకు సిబ్బంది, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు బిఎస్ఎన్ఎల్ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొంటారని, అందరూ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ధికార సంస్థ కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు.

## 6 లోక్ అదాలత్ బెంచిలు ఏర్పాటు

జాతీయ లోక్ అదాలతో కేసులు సత్వరం పరిష్కరించడానికి 6 ప్రత్యేక లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేస్తూ జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. మొదటి లోక్ అదాలత్ బెంచి ప్రిసైడింగ్ అధికారిగా ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి ఎంఏ సోమశేఖర్, సభ్యుడుగా సీనియర్ న్యాయవాది సిహెచ్ లక్ష్మీప్రసాదరావు, రెండవ లోక్ అదాలత్ బెంచ్ ప్రిసైడింగ్ అధికారిగా మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ శ్రీనివాస్, సభ్యుడుగా సీనియర్ న్యాయవాది వివి కోటేశ్వరరావు, మూడవ లోక్ అదాలత్ బెంచ్ ప్రిసైడింగ్ అధికారిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ జి.స్వాతి, సభ్యురాలిగా సీనియర్ న్యాయవాది కె.ఆర్ దుర్గాంబ, నాలుగవ లోక్ అదాలత్ బెంచ్ ప్రిసైడింగ్ అధికారిగా రెండవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎల్.శారదరెడ్డి, బెంచి సభ్యులుగా సీనియర్ న్యాయవాది తంజావూరు శ్రీనివాసరావు, ఐదవ బెంచ్ ప్రిసైడింగ్ అధికారిగా మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ రెహ్మాన్, సభ్యులుగా సీనియర్ న్యాయవాది వి.సారిక, ఆరవ బెంచ్ ప్రిసీడింగ్ అధికారిగా నాలుగవ అదనపు జుడిషియల్ మెజిస్ట్రేట్ షేక్ నిషాద్ నాజ్, సభ్యులుగా సీనియర్ న్యాయవాది ఎస్‌డి వసీంలను నియమిస్తూ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

## బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి సన్మానం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బండగానపల్లె పంచాయతీ పరిధిలోని బీజం పల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో గత ఐదు సంవత్సరాలుగా గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో బదిలీపై వెళ్లిన జే.కృష్ణయ్యను శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది స్థానికులు సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాఠశాలలో ఐదు సంవత్సరాలుగా ఉపాధ్యాయుల పని చేస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దారన్నారు. ఆయన అందించిన సేవలు మరువలేని వన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జే.మాధవరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## హామీలు అమలుచేస్తున్న కూటమి ప్రభుత్వం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేస్తున్నది తమ కూటమిప్రభుత్వమని, ఆత్మకూరును అభివృద్ధిపథంలో నిలుపుతున్నది తమ నేత రాష్ట్రదేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అని పట్టణంలోని 20వవార్డు కౌన్సిలర్ సూరా భాస్కరరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం సుపరిపాలనలోతొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి ఆనం ఆదేశాలమేరకు తమ వార్డులోఓ ఇంటింటా పర్యటించారు. అందరికీ ఈ ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో అమలుచేసిన సంక్షేమపథకాలు, సాధించిన అభివృద్ధి గురించి తెలిపే కరపత్రాలను అందరికీ పంచిపెట్టారు. తెలుగుదేశం పట్టణ సాంస్కృతికవిబాగం అధ్యక్షుడు నాగులూరు చిన్నబ్బయ్యతో కలిసి సూరా పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షన్‌పెంపు, మెగా డిఎస్‌సి, తల్లికివందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ తదితర పథకాలను తమ ప్రభుత్వం అమలుచేసిందని, ఈనెలలో రైతులకు అన్నదాతసుఖీభవ పథకం అమలుకానుందని, ఆగస్టు15నుండి మహిళలకు ఉచితబస్‌సౌకర్యం లభించనుందని, అనంతరం ఆడబిడ్డనిధి పథకం అమలుకానుందని, అభివృద్ధిపరంగా అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, రోడ్డు నిర్మాణాలు, మరమ్మత్తులు జరిగాయని, ఇంకా జరుగనున్నాయని ఆయన వివరించారు. ఒక్క ఏడాదిలోనే ఈకార్యక్రమాలు నిర్వహించి తొలిఅడుగు వేశామని, రానున్న నాలుగుసంవత్సరాల్లో అన్ని సంక్షేమఫలాలను అందిస్తామని, అన్నిప్రాంతాల అభివృద్ధి సాధిస్తామని భాస్కరరెడ్డి పాల్గొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గతంలో వేలాదికోట్లరూపాయలతో అభివృద్ధిని పరుగులు తీయించారని, మళ్ళీ ఈ ఏడాదిలో వందలాదికోట్లు నిధులు సాధించి ప్రగతిని పట్టాలెక్కించారని సూరా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకుడు గుర్నాధం శ్రీనయ్య, పలువురు కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం చేయాలని ఆవేదన



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** పూరికా కాలం నుండి తమ ఆధీనంలో ఉన్న భూమిలో ఇటీవల పనులు చేస్తుండగా తమ సమీప బంధువులు దౌర్జన్యానికి పాల్పడి తమ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని డక్కునూరు గ్రామానికి చెందిన రైతు దేవరపు మధు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ.. సుమారు పది సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో తమ పూర్వీకుల భూములను పంపకాలు చేయటం జరిగిందని అన్నారు. దీంతో రెండు సంవత్సరాల క్రితం సమగ్రంగా సర్వే చేపట్టి తమ ఆధీనంలో ఉన్న భూములను ఇటీవల ఇనుపకంచెను వేసుకునేందుకు పనులు చేపట్టడం జరిగిందని అన్నారు దీంతో సమీప తమ సమీప బంధువు ఇనుపకంచెను ధ్వంసం చేసి తమ పై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర ఆధారాలతో పోలీసుల సంప్రదించినప్పటికీ ఫలితం లేకపోయిందని వాపోయారు. అంతేకాక తనపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటూ తమ గోడును వెల్లపుచ్చుకున్నాడు.